ఉచితాలు ఇస్తే ప్రజలు పనిచేయరు!

- ఉచిత హామీలు ఎంతమాత్రం మంచివి కాదు
- సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు
- ఉచితాల పేరిట ప్రజల్ని పరాన్నజీవులుగా మార్చట్లేదా? అంటూ రాజకీయ పార్టీలకు ప్రశ్న

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత హామీలపై సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఉచితాలు మంచివి కానే కాదన్న ధర్మాసనం.. వీటి వల్ల ప్రజలు పనిచేయడానికి ఎంతమాత్రం ఇష్టపడట్లేదని వ్యాఖ్యానించింది. ఉచితాలతో ప్రజలను ఒకవిధంగా పరాన్నజీవులుగా మార్చడం లేదా? అంటూ రాజకీయ పార్టీలను సూటిగా ప్రశ్నించింది. ఢిల్లీలో ఇండ్లులేని వారికి ఆశ్రయం కల్పించాలంటూ దాఖలైన ఓ పిటిషన్‌ను బుధవారం విచారిస్తూ ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- 'లడ్‌కీ బహిన్' వంటి స్కీమ్‌ల ద్వారా డబ్బులు, ఫ్రీ రేషన్ పేరిట ఇంటికే ఆహార ధాన్యాలు ఇలా అన్నీ ప్రజలకు ఉచితంగానే అందుతున్నాయి. ఎలాంటి పనులు చేయకుండానే ఇవి వస్తుండటంతో ప్రజలు ఉచితాలకే అలవాటుపడిపోతున్నారు.
- ఉచిత పథకాలు మంచివి కానేకావు. దురదృష్టవశాత్తూ.. వీటి కారణంగా ప్రజలు పనిచేయడానికి ఇష్టపడట్లేదు.
- (పనిచేయడానికి ఇష్టపడని వ్యక్తులు దేశంలో ఎవరూ ఉండరని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అన్న మాటలకు స్పందించిన ధర్మాసనంలోని ఓ జడ్జి..) ఈ విషయంలో మీకు ఒకవైపు మాత్రమే అవగాహన ఉందనుకొంటా.. నా వ్యక్తిగత అనుభవాన్ని చెప్తా వినండి.. నేను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చా. మొన్నటి మహారాష్ట్ర ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఉచితాలను ప్రకటించాయి. దీంతో పొలంలో పనిచేయడానికి కూలీలు కూడా ఎవరూ రాలేదు. ఇంటికే అన్నీ ఉచితంగా వస్తున్నప్పుడు పొలంలో పనిచేయడానికి ఎవరు ఇష్టపడుతారు? మీరే చెప్పండి??

- ఉచితాల పేరుతో ప్రజలను మనం (రాజకీయ పార్టీలు) ఒకవిధంగా పరాన్నజీవులుగా మార్చట్లేదా?
- ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఉచితాలు ప్రకటించే పద్ధతి ఎంతమాత్రం సరైనది కాదు.
- ఇక ఈ పిల్ విషయానికి వస్తే, ప్రజలకు ఆశ్రయం కల్పించాలన్న ప్రభుత్వాల ఉద్దేశం మంచిదే కానీ, వారిని దేశాభివృద్ధిలో భాగం చేయాలి. అయితే, ఉచితాలతో అది జరుగట్లేదు. అంటూ పేర్కొన్న న్యాయస్థానం.. పట్టణ పేదరిక నిర్మూలన మిషన్ ఎంతకాలంపాటు పనిచేస్తుందో తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.

ఉచితాలు.. అవినీతికి మార్గాలు!

ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న ఉచిత హామీలు అవినీతికి మార్గాలుగా పరిణమిస్తున్నాయంటూ రిటైర్డ్ జడ్జి ఒకరు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఎన్నికల సంఘం విచారించి ఉచిత హామీలన్నీ రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలంటూ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఈసీకి కోర్టు ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. దీనిపై బుధవారం విచారించిన ఢిల్లీ హైకోర్టు.. ఉచితాలపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో టాప్ కోర్టును ఆశ్రయించాలంటూ పిటిషనర్‌కు సూచించింది.

సంక్షేమ పథకాల వల్లే కార్మికుల కొరత

సంక్షేమ పథకాల అమలు కారణంగానే నిర్మాణ రంగంలో వలస కార్మికులు తగ్గిపోతున్నారని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యానించారు. చెన్నైలో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య సదస్సులో మంగళవారం పాల్గొన్న ఆయన మాట్లాడారు. 'ఈ రోజుల్లో అవకాశాల కోసం కార్మికులు ఎవరూ వేరే ప్రాంతానికి వలస వెళ్లేందుకు ఇష్టపడట్లేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వస్తున్న సంపాదన దీనికి ఒక కారణం కావొచ్చు' అని అభిప్రాయపడ్డారు. కాగా 'భార్యను ఎంతసేపు అలానే చూస్తూ ఉండిపోతారు.. ఆదివారాలు కూడా పనిచేయండి' అంటూ వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌పై సుబ్రహ్మణ్యన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమవ్వడం తెలిసిందే. -ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్

భార్యతో అసహజ శృంగారం నేరం కాదు

ఆమె అనుమతి లేకపోయినా తప్పలేదు
ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తీర్పు

ఛత్తీస్‌గఢ్, ఫిబ్రవరి 13: మేజర్ అయిన భార్యతో ఆమె అంగీకారం లేకపోయినా శృంగారంలో పాల్గొనడం, అసహజ సంభోగం నేరం కాదని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తీర్పు చెప్పింది. ఆమె భర్తపై ఐపీసీ సెక్షన్ 375(అత్యాచారం), సెక్షన్ 377(అసహజ శృంగారం) కింద శిక్ష విధించడానికి వీలు లేదని తెలిపింది. గోరఖ్‌నాథ్ శర్మ అనే వ్యక్తి తన భార్యతో అసహజ శృంగారానికి పాల్పడటంతో ఆమె తీవ్ర నొప్పితో దవాఖానలో చికిత్స పొందుతూ మరణించింది. మరణ వాంగ్మూలం రికార్డు చేసిన సమయంలో ఆమె తన భర్త చర్యను బయటపెట్టారు. దీంతో ట్రయల్ కోర్టు గోరఖ్‌నాథ్ శర్మకు ఐపీసీలోని 375, 377, 304 సెక్షన్ల కింద పదేండ్ల జైలుశిక్ష విధించింది. ఈ తీర్పును అతడు ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో అప్పీల్ చేయగా జస్టిస్ నరేంద్ర కుమార్ వ్యాస్ ధర్మాసనం తాజాగా తీర్పు చెప్పింది. ఐపీసీ సెక్షన్ 375కు 2013లో చేసిన సవరణ ప్రకారం మేజర్ అయిన భార్యతో భర్త శృంగారం, ఇతర లైంగిక చర్యల్లో పాల్గొనడం నేరం కాదని కోర్టు పేర్కొన్నది.

రేప్ బాధితురాలికి అబార్షన్ చేసుకునే హక్కు

అలహాబాద్ హైకోర్టు తీర్పు

ప్రయాగ్‌రాజ్: అత్యాచార బాధితురాలికి వైద్యపరంగా గర్భవిచ్ఛిత్తి చేసుకునే హక్కు చట్టపరంగా ఉందని అలహాబాద్ హైకోర్టు స్పష్టంచేసింది. బిడ్డను కనాలో వద్దో నిర్ణయించుకునే అధికారం బాధితురాలికి ఉందని తెలిపింది. గర్భవిచ్ఛిత్తిని కోరుతూ ఓ బాలిక దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు బుధవారం విచారణ జరిపింది. అత్యాచార బాధితురాలికి అబార్షన్ చేసుకునే హక్కు మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్‌లోని సెక్షన్ 3(2) కల్పిస్తుందని ధర్మాసనం పేర్కొంది. లైంగిక దాడి కేసులో ఒక మహిళకు గర్భవిచ్ఛిత్తికి అనుమతి ఇవ్వకపోవడం, బలవంతంగా ఆమెకు మాతృత్వ బాధ్యతలు కట్టబెట్టడం గౌరవప్రదంగా జీవించే హక్కును ఆమెకు లేకుండా చేయడమేనని తెలిపింది.

అదానీ కోసం.. దేశ భద్రత గాలికి!

- సరిహద్దు నిబంధనలను ఏకపక్షంగా మార్చిన కేంద్రం
- గుజరాత్ కచ్ ప్రాంతంలోని అదానీ ప్రాజెక్టు కోసమే
- పాక్‌కు కూతవేటు దూరంలో భూముల కేటాయింపు
- సైన్యం పెట్రోలింగ్‌కు ఎదురవ్వనున్న ఇబ్బందులు
- బ్రిటిష్ పత్రిక 'ది గార్డియన్'లో సంచలనాత్మక కథనం
- దేశ భద్రతకు ముప్పేనంటున్న రక్షణ రంగ నిపుణులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆప్త మిత్రుడంటూ ప్రతిపక్షాలు విమర్శించే ప్రపంచ కుబేరుడు గౌతమ్ అదానీ కంపెనీ కోసం సరిహద్దు నిబంధనలను కేంద్రప్రభుత్వం సవరించిందా? అదానీ డ్రీమ్ ప్రాజెక్టు కోసమని, ఆయనకు లబ్ధి చేకూర్చడానికి దేశ భద్రతను గాలిలో దీపంగా మార్చేసిందా? బ్రిటిష్ పత్రిక 'ది గార్డియన్'లో బుధవారం ప్రచురితమైన ఓ కథనం ఈ అనుమానాలకు తావిస్తున్నది.

పాక్‌కు కూతవేటు దూరంలోనే..

పునరుత్పాదక శక్తి రంగంలో విస్తరించాలనుకొంటున్న అదానీ గ్రూప్ గుజరాత్‌లోని ఖావ్‌డాలో సౌర, పవన విద్యుత్తు ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. 2020లో దీన్ని ప్రధాని మోదీ లాంఛనంగా ప్రారంభించారు. అయితే, ఈ ప్లాంట్‌ను మరింతగా విస్తరించడానికి అదానీ గ్రూప్ ప్రణాళికలను సిద్ధం చేసినప్పటికీ, విస్తరణకు అవసరమైన రాణ్ ఆఫ్ కచ్‌లోని భూములు పాకిస్థాన్ సరిహద్దుకు అత్యంత సమీపంలో ఉండటంతో అది సాధ్యపడట్లేదు. సరిహద్దు నిబంధనల ప్రకారం.. అంతర్జాతీయ సరిహద్దులకు 10 కిలోమీటర్ల దూరంలోపు ఎలాంటి వాణిజ్య నిర్మాణాలు చేపట్టకూడదు. అయితే, 2023 ఏప్రిల్, మేలో రెండుసార్లు ఢిల్లీలో జరిగిన అత్యున్నత స్థాయి సమావేశాల్లో సరిహద్దుల్లోని నిబంధనలను కేంద్రం ఏకపక్షంగా మార్చివేసింది. అలాగే, రాణ్ ఆఫ్ కచ్ ప్రాంతంలోని 230 చదరపు కిలోమీటర్ల భూములను తొలుత సోలార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ)కు.. అనంతరం ఎస్ఈసీఐ నుంచి ఈ భూములను ఆగస్టు, 2023లో అదానీ కంపెనీకి కట్టబెట్టింది. ఈ మేరకు 'గార్డియన్' పత్రిక తన సంచలన కథనంలో ఆరోపించింది. ఒక్క

పాక్ సరిహద్దుల్లోనే కాకుండా బంగ్లాదేశ్, చైనా, మయన్మార్, నేపాల్ సరిహద్దుల విషయంలోనూ కొత్త నిబంధనలు పాటించాలని కేంద్రం ఆదేశించినట్టు గార్డియన్ పత్రిక వివరించింది. గతంలో సరిహద్దుల నుంచి కనీసం 10 కిలోమీటర్ల పరిధిలో కూడా నిర్మాణాలను చేపట్టని అదానీ కంపెనీ.. కొత్త నిబంధనలు అమల్లోకి రావడంతో.. పాకిస్థాన్ సరిహద్దుకు కేవలంకిలోమీటర్ దూరంలోనే ఇప్పుడు అదానీ కంపెనీ సోలార్ ప్యానెల్స్, విండ్ టర్బైన్స్‌ను తయారు చేస్తున్నట్టు పత్రిక పేర్కొంది.

ఎంతో నష్టదాయకం

రాణ్ ఆఫ్ కచ్ భూములను అదానీ కంపెనీకి కట్టబెట్టే నిర్ణయం తీసుకొన్నప్పుడు ఆ ప్రాంతంలో పర్యవేక్షణ బాధ్యతలు చూసుకొంటున్న సీనియర్ ఆర్మీ అధికారులను కూడా కేంద్రం ఎంతమాత్రం సంప్రదించలేదని గార్డియన్ ఆరోపించింది. ఇండియా-పాకిస్థాన్ మధ్య ఘర్షణలు జరిగినప్పుడు గతంలో శత్రుదేశం తొలుత రాణ్ ఆఫ్ కచ్‌లోని సిర్ క్రీక్ ప్రాంతం మీదనే నాలుగుసార్లు దాడి చేసిందని రక్షణ రంగ నిపుణులు గుర్తు చేస్తున్నారు. ఒకవేళ భవిష్యత్తులో పాకిస్థాన్‌తో ఘర్షణ వాతావరణం ఏర్పడితే అదానీ కంపెనీ వాణిజ్య కార్యకలాపాలు చేపడుతున్న రాణ్ ఆఫ్ కచ్‌లోకి మన ఆర్మీ యుద్ధ ట్యాంకులను ఎలా తరలించగలదని ప్రశ్నిస్తున్నారు. సైన్యం పెట్రోలింగ్‌కు కొత్త ఇబ్బందులు తలెత్తవచ్చని చెప్తున్నారు. కేంద్రం తాజా నిర్ణయం దేశ భద్రతకు ఎంతో నష్టదాయకమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'ది గార్డియన్' కథనంపై కేంద్రం స్పందించాల్సి ఉన్నది.

అవివేకమైన చర్య

దేశ భద్రతకు వ్యూహాత్మకమైన సరిహద్దుల్లోని భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం అవివేకమైన చర్య. శత్రుదేశానికి చెందిన చొరబాటుదారులు మన దేశంలోకి ప్రవేశిస్తే వాళ్లను ఇప్పుడు ఎలా ఎదుర్కోగలం? ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం ఆలోచిస్తే.. ఇప్పుడు ఆర్మీపై మరింత ఒత్తిడి పడినట్లయ్యింది.
- అజయ్ శుక్లా, రిటైర్డ్ ఆర్మీ కర్నల్

7 అయ్యిందా? పని ఆపేయ్

ఉద్యోగులకు ఓ సంస్థ కఠిన నిబంధన

ముంబై: వారానికి 70 గంటలు పని చేయాలని, 90 గంటలు పని చేయడంతో పాటు ఆదివారాలూ ఆఫీసులకు రావాలని పెద్ద కంపెనీల బాసులు చెప్తుంటే.. రెడ్ ఇన్ ది వైట్ అనే యాడ్ ఏజెన్సీ టైమ్‌కు పని ముగించాలనే నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నది. తమ ఉద్యోగులు రాత్రి 7 అయ్యిందంటే కచ్చితంగా లాగ్‌ఆఫ్ చేయాలని చెప్తామని సంస్థ ఫౌండర్ ప్రణీత బజోరియా తెలిపారు.

అలిసిపోతే పెగ్గు.. హ్యాంగోవర్ అయితే సెలవు

ఉద్యోగులకు ఓ జపాన్ కంపెనీ ఆఫర్లు

టోక్యో: ఉద్యోగులు పని చేస్తూ అలిసిపోతే ఆఫీస్‌లోనే పెగ్గేయొచ్చు. మందు ఎక్కువై హ్యాంగోవర్ అయితే మరునాడు ఆఫీస్‌కు లేటుగా రావొచ్చు. అవసరమైతే సెలవు తీసుకోవచ్చు. జపాన్‌కు చెందిన ట్రస్ట్ రింగ్ కో అనే కంపెనీ ఉద్యోగులకు ఇలాంటి అసాధారణ ఆఫర్లు ఇస్తున్నది. ఒసాకా కేంద్రంగా పని చేసే ఈ చిన్న ఐటీ కంపెనీ.. సంప్రదాయ ఆఫీస్ కల్చర్‌ను బద్దలుకొడుతున్నది. కొత్త రూల్స్‌తో ఉద్యోగులను ఆకట్టుకుంటున్నది. సాధారణంగా ఐటీ ఉద్యోగులకు జీతాలు భారీగా ఉంటాయి. ఈ చిన్న సంస్థ భారీ వేతనాలను ఇచ్చుకోలేదు. దీంతో ప్రతిభ కలిగిన కొత్త ఉద్యోగులు తమ సంస్థలో చేరేలా, చేరిన వారు నాలుగు కాలాల పాటు కొనసాగేలా ఆకర్షించేందుకు తమ పని విధానాన్ని ఇలా మార్చేశామని కంపెనీ సీఈఓ తుకుయా సుగియురా చెప్తున్నారు. ఉద్యోగులకు కార్యాలయంలోనే ఉచితంగా మద్యం సరఫరా చేస్తామని, తానూ అప్పుడప్పుడు వారితో కలిసి చిల్ అవుతానని అంటున్నారు. కొత్త ఉద్యోగులకు స్వయంగా డ్రింక్ ఇచ్చి కంపెనీలోకి ఆహ్వానిస్తానని చెప్తున్నారు. తమ విధానం వల్ల పని, వినోదం మధ్య సమతుల్యం ఏర్పడుతుందన్నారు.

ఎంవీఏలో ముసలం

షిండేపై శరద్‌పవార్ ప్రశంసలు.. ఉద్ధవ్ ఠాక్రే వర్గం ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: మహారాష్ట్రలో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి(ఎంవీఏ) కూటమిలో ఏర్పడిన లుకలుకలు బహిర్గతమయ్యాయి. ఢిల్లీలో జరిగిన 98వ అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళన్‌లో ఏక్‌నాథ్ షిండేకు మహాద్‌జీ షిండే రాష్ట్ర గౌరవ్ పురస్కారాన్ని శరద్ పవార్ తానే స్వయంగా ప్రదానం చేశారు. థాణే, నవీ ముంబై, ముంబై అభివృద్ధి కోసం ఏక్‌నాథ్ షిండే చేసిన సేవలను పవార్ కొనియాడారు. శరద్ పవార్ సన్మానించింది షిండేను కాదని, అమిత్ షాను సన్మానించినట్టుగానే తాము చూస్తామని శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. సీనియర్ రాజకీయ నాయకులైన మిమ్మల్ని గౌరవిస్తామని, కాని బాలాసాహెబ్ ఠాక్రే స్థాపించిన పార్టీని అమిత్ షా సాయంతో చీల్చి మహారాష్ట్రను బలహీనపరిచిన వ్యక్తిని మీరు సన్మానిస్తున్నారని, ఇది మరాఠీ ప్రజల మనోభావాలను గాయపరుస్తుందని శరద్ పవార్‌ను ఉద్దేశించి రౌత్ విమర్శించారు. అయితే ఈ కార్యక్రమానికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వనవసరం లేదని, ఇది సాహితీ, సాంస్కృతిక వేదికని, రాజకీయ వేదిక కాదని శరద్ వర్గం పేర్కొంది.

సిక్కుల ఊచకోత కేసులో సజ్జన్ కుమార్ దోషి

ఢిల్లీ ప్రత్యేక కోర్టు తీర్పు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: 1984లో సిక్కులకు వ్యతిరేకంగా జరిగిన విధ్వంస కాండ సందర్భంగా ఢిల్లీలోని సరస్వతీ విహార్‌లో ఇద్దరు వ్యక్తుల ఊచకోత కేసులో కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్‌ను దోషిగా తేలుస్తూ ఢిల్లీ కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. ఫిబ్రవరి 18న శిక్షను ఖరారు చేయనున్నట్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా తెలిపారు. 1984 నవంబర్ 1న జస్వంత్‌సింగ్, ఆయన కుమారుడు తరుణ్‌దీప్ సింగ్ హత్యకు గురయ్యారు.

అయోధ్య రామాలయ ప్రధాన
పూజారి కన్నుమూత

అనారోగ్యంతో 85 ఏళ్ల సత్యేంద్రదాస్ మృతి

లక్నో, ఫిబ్రవరి 12: అయోధ్యలోని రామజన్మభూమి ఆలయ ప్రధాన పూజారి మహంత్ సత్యేంద్ర దాస్ బుధవారం కన్నుమూశారు. ఫిబ్రవరి 3న బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో 85 ఏళ్ల దాస్‌ను ఇక్కడి సంజయ్ గాంధీ పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎస్జీపీజీ)లో చేర్చగా బుధవారం ఆయన తుది శ్వాస విడిచారని దవాఖాన తెలిపింది. సత్యేంద్ర దాస్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన తన జీవితాన్ని శ్రీరాముడి సేవకు అంకితం చేశారని పేర్కొన్నారు. తన 20వ ఏట సన్యాస దీక్ష తీసుకున్న సత్యేంద్ర దాస్ 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో రామ జన్మభూమి ఆలయ పూజారిగా ఉన్నారు.

మండుతున్న వంటనూనెల ధరలు

15 రోజుల్లోనే 5 శాతానికి పైగా పెరిగిన రేట్లు
రూపాయి పతనంతో మరింత పెరిగే అవకాశం
దిగుమతి చేసుకునే పండ్ల ధరలకూ రెక్కలు

ఢిల్లీ: దేశంలో వంటనూనెల ధరలకు రెక్కలొచ్చాయి. రోజురోజుకు పతనమవుతున్న రూపాయి విలువ దిగుమతులపై ప్రభావం చూపుతున్నది. దీంతో గత రెండు వారాలుగా వంటనూనెల ధరలు 5% వరకు పెరిగాయి. దాంతో పాటు దిగుమతి చేసుకుంటున్న కివీ, అవకాడో, పియర్స్, యాపిల్, నట్స్, డ్రైఫ్రూట్స్ తోపాటు వివిధ రకాల పండ్ల ధరలకు రెక్కలొచ్చాయి. మన దేశంలో వినియోగించే వంటనూనెలో 60 శాతం వరకు దిగుమతి చేసుకునేదే కావడంతో రూపాయి పతనం ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. దీంతో సోయాబీన్, సన్‌ఫ్లవర్, పామాయిల్ ధరలు కిలోకు సుమారు రూ.5-6 వరకు పెరిగాయి.

రాబోయే రోజుల్లో మరింత ప్రియం

గతేడాది డిసెంబర్ నుంచి చూసుకుంటే.. దిగుమతి చేసుకునే అవకాడో ధరలు 22 శాతం పెరిగాయి. డాలర్ బలపడటం, సరఫరా తగ్గడంతో డిసెంబర్‌లో రూ.360 ఉన్న కిలో అవకాడో ధర ఇప్పుడు రూ.440కి ఎగబాకింది. రాబోయే రోజుల్లో పండ్ల ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మెట్రో నగరాల్లో ప్రీమియం యాపిల్స్ 8-10%, కివీ, అవకాడో, పియర్స్, బెర్రీ లాంటి పండ్ల ధరలు 10-15% వరకు పెరిగే చాన్స్ ఉన్నట్టు పేర్కొంటున్నాయి. రాబోయే రోజుల్లో ఇలాగే రూపాయి పతనం కొనసాగితే వంటనూనెల ధరలు మరింత పెరిగే అవకాశమున్నట్టు సన్‌విన్ గ్రూప్ సీఈవో సందీప్ బజోరియా తెలిపారు.

వంటనూనెల ధరల పెరుగుదల ఇలా.. (కిలో)

ఆయిల్	2వారాల క్రితం	ప్రస్తుత ధర	పెరుగుదల శాతం
పామ్	140	146	4.3
సోయాబీన్	128	135	5.4
సన్‌ఫ్లవర్	153	158	3.2
పల్లీనూనె	183	185	1
కాటన్‌సీడ్	125	131	4.8
ఆవ	163	166	1.8
రైస్‌బ్రాన్	125	132	5.6

బుధవారం మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా మహాకుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న కోట్లాదిమంది భక్తులు

హోటల్ రూము గంటకు 5,000

- *పడవ ప్రయాణానికి ఏకంగా రూ. 1,500*
- *మహాకుంభమేళా భక్తులకు చుక్కలు చూపిస్తున్న రేట్లు*

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: భారీ సంఖ్యలో భక్తులు మహా కుంభమేళాను సందర్శిస్తుండటంతో రవాణా సదుపాయాల కొరత, ఆకాశాన్నంటే ధరలు భక్తులకు చుక్కలు చూపిస్తున్నాయి. చాలా మంది భక్తులు త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించకుండానే వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. అరకొర ఏర్పాట్లు చేసిన ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం మహా కుంభ్‌పై అంచనాలను పెంచివేసిందని, దీంతో అక్కడకు వెళ్లిన భక్తులను పెంచిన ధరలు, సౌకర్యాల లేమి వెంటాడుతున్నాయంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శించిన నేపథ్యంలో మహా కుంభ్‌ను సందర్శించిన కొందరు భక్తులు తమకు ఎదురైన చేదు అనుభవాలను మీడియాతో పంచుకున్నారు. సంగం వద్దకు వెళ్లేందుకు ప్రైవేట్ ఆటోలు, ఇతరవాహనాలు వందల్లో చార్జీలు వసూలు చేస్తున్నారని దినేశ్ రాణా అనే భక్తుడు వాపోయాడు. సాధారణ హోటల్ ధరలు సైతం ఫైవ్ స్టార్ రేట్లను మరపిస్తున్నాయి. ఒక్కో గదికి గంటకు రూ. 5,000 చొప్పున వసూలు చేస్తున్నారు. సంగం వద్దకు వెళ్లడానికి పడవలో ఒక్కో మనిషికి రూ. 150 చొప్పున తీసుకోవలసి ఉండగా ప్రస్తుతం రూ. 1,000 నుంచి రూ. 1,500 వరకు పడవ నిర్వాహకులు దండుకుంటున్నారు.

కమల్ హాసన్‌కు రాజ్యసభ సభ్యత్వం?

డీఎంకే నుంచి ఆఫర్

చెన్నై: ప్రముఖ నటుడు, రాజకీయ నేత కమల్ హాసన్‌కు కీలక పదవి దక్కనున్నది. అధికార డీఎంకే మద్దతుతో తమిళనాడు నుంచి ఆయన రాజ్యసభకు నామినేట్ కానున్నట్టు పార్టీ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఈ ఏడాది జూలైలో మరో విడత రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడు మంత్రి పీకే శేఖర్ బాబు బుధవారం కమల్ హాసన్‌ను ఆయన నివాసంలో కలుసుకుని చర్చలు జరిపారు. మక్కల్ నీది మయ్యమ్(ఎంఎన్ఎం) పార్టీని స్థాపించిన కమల్ హాసన్ గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల కోసం డీఎంకే సారథ్యంలోని కూటమితో చేతులు కలిపి ప్రచారం నిర్వహించారు. కూటమి మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా ఈ ఏడాది ఎంఎన్ఎంకు ఒక రాజ్యసభ స్థానం దక్కనున్నది.

మర్మాంగాలకు డంబెల్స్ వేలాడదీసి

కేరళలో ర్యాగింగ్ పేరుతో రాక్షస క్రీడ

కొచ్చి: కేరళలో కొందరు సీనియర్ విద్యార్థులు తమ జూనియర్లపై రాక్షసంగా ప్రవర్తించారు. ర్యాగింగ్ పేరుతో దారుణంగా హింసించారు. కొట్టాయంలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జరిగిన ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నర్సింగ్ మూడో ఏడాది చదువుతున్న శామ్యూల్ జాన్సన్, జీవ, రాహుల్ రాజ్, రిజిల్ జిత్, వివేక్ అనే విద్యార్థులు కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన జూనియర్ విద్యార్థులను 4 నెలలుగా ర్యాగింగ్ పేరుతో వేధిస్తున్నారు. కంపాస్ వంటి స్టేషనరీ పరికరాలతో జూనియర్ల శరీరాలపై కాట్లు పెట్టడం, వాటిపై బాడీ లోషన్ పోయడం, దుస్తులు విప్పించడం, మర్మాంగాలకు డంబెల్స్ వేలాడదీయడం వంటి రాక్షస చర్యలకు ఒడిగట్టారు. పోలీసులు ఐదుగురిని అరెస్ట్‌చేశారు.

బ్రిటన్ పౌరసత్వ నిబంధనలు మరింత కఠినతరం

లండన్: అక్రమ వలసదారులకు పౌరసత్వం లభించకుండా యూకే ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. ఈ మేరకు సోమవారం యూకే హోం కార్యాలయం ఇమ్మిగ్రేషన్ సిబ్బందికి కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. అక్రమంగా, ప్రమాదకర ప్రయాణం చేసి యూకేలోకి అడుగుపెట్టే వారికి పౌరసత్వాన్ని ఇవ్వొద్దని ఇందులో స్పష్టం చేసింది. అక్రమ వలసదారులు ఏ రకంగా ప్రయాణించి వచ్చినా దానిని ప్రమాదకర ప్రయాణంగానే భావించి, పౌరసత్వ దరఖాస్తు తిరస్కరించాలని తెలిపింది. ఇప్పటికే అక్రమ వలసదారులు యూకే పౌరసత్వం పొందకుండా నిబంధనలు ఉన్నాయని, తాజా మార్గదర్శకాలతో ఇవి మరింత కఠినతరం అయ్యాయని యూకే హోం కార్యాలయ అధికార ప్రతినిధి తెలిపారు.

యుద్ధం ముగింపుపై పుతిన్‌తో మాట్లాడా

- తక్షణమే చర్చలు ప్రారంభిస్తాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి

వాషింగ్టన్: దాదాపు మూడేండ్ల నుంచి సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెరపడబోతున్నదా? అంటే, 'ఔను' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ విషయమై రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఫోన్‌లో సంభాషించినట్టు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ప్రకటించారు. ఎలాంటి ఆలస్యం లేకుండా తమ బృందాలు వెంటనే చర్చలు ప్రారంభించేందుకు ఇద్దరమూ అంగీకరించామని ట్రంప్ వెల్లడించారు. తమ మధ్య సంభాషణను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి తెలపడం ద్వారా చర్చల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. చర్చలకు నేతృత్వం వహించే బాధ్యతను ఆయన పలువురు ఉన్నతాధికారులకు అప్పగించారు. కాగా, దాదాపు గంటన్నర పాటు ట్రంప్, పుతిన్ ఫోన్ మాట్లాడుకున్నారని, ట్రంప్‌ను మాస్కోలో పర్యటించాల్సిందిగా పుతిన్ ఆహ్వానించారని రష్యా వర్గాలు తెలిపాయి.

రష్యాతో భూభాగ మార్పిడికి సిద్ధం: జెలెన్‌స్కీ

రష్యాతో భూభాగ మార్పిడికి తాము సిద్ధమని అంతకుముందు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. రష్యా ఆక్రమించుకున్న ఉక్రెయిన్ ప్రాంతంలోని భూభాగానికి బదులుగా తాము ఆక్రమించుకున్న రష్యా ప్రాంతానికి చెందిన కుర్స్‌ని అప్పగించేందుకు సిద్ధమని ఆయన ప్రతిపాదించారు. అయితే చర్చలకు ఇరు దేశాలను తీసుకువచ్చే కీలక పాత్రను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోషించాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు షరతు విధించారు. దాదాపు మూడేళ్లుగా రెండ